


# నవభూమి

జిల్లా అనుబంధం

07 డిసెంబర్,2024 శనివారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


# కొత్తగూడెంకు ఎర్త్ సైన్సెస్ వర్సిటీ



- యూనివర్సిటీకి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని కేబినెట్ నిర్ణయం
- ముఖ్యమంత్రి రేవంత్‌కు మంత్రి తుమ్మల ధన్యవాదాలు
- ప్రపంచ స్థాయిలో మారుమోగనున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖ్యాతి
- ఆనందోత్సవాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు

4



**ఎంఏ వాహాబ్ / కొత్తగూడెం జూన్ 5 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నామకరణం చేస్తూ తెలంగాణ మంత్రిమండలి గురువారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కాంగ్రెస్ సర్కారు మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మార్చింది. ఇపుడు మరో ముందడుగు వేసి యూనివర్సిటీకి, ప్రముఖ ఆర్థిక వేత్త, భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరును ఖరారు చేసింది. క్యాబినెట్ నిర్ణయం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హార్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి మండలి సభ్యులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహజ వనరులు, మినరల్స్ ఉన్న భద్రాద్రి కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం కు భారత మాజీ ప్రధాని పేరు నామకరణం చేయడంతో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించునుంది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

### 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం:

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపు దిద్దుకుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాది మందికి విద్య ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారింది. ప్రస్తుతం ఈ మైనింగ్ కళాశాల మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందడంతో వేలాది మంది యువ శాస్త్రవేత్తల ఇక్కడి నుంచే దేశ భవిష్యత్తుకు బాటలు వేయనున్నారు. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్ర పోషించనుంది. ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులను అమలుతో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది. ప్రపంచంలోనే ఇలాంటి విశ్వవిద్యాలయం ఒక అమెరికాలో మాత్రమే ఉన్నది. యూనివర్సిటీలో అందించనున్న కోర్సులు, అండర్ గ్రాడ్యుయేట్ (బి ఎస్సి) ప్రోగ్రాంలో జియాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ, పీజీ (ఎం ఎస్ సి) ప్రోగ్రాంలో జీయాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ, పీ హెచ్ డి. ప్రోగ్రాంలో యూజీసీ నిబంధనల ప్రకారం కోర్సులను అందించడంతో పాటు ఇప్పటికే బి.టెక్ ప్రోగ్రాంలో ఉన్న మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లలో ప్రతి కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 780 సీట్లతో విద్యనందించనున్నారు.

### మంత్రి తుమ్మల కృషి:

మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడంలో మంత్రి తుమ్మల కృషి చేశారు. అలాగే మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం పట్ల మంత్రి తుమ్మల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అపర చాణిక్యుడిగా, అభివృద్ధి ప్రధాతగా, విజన్ కలిగిన నేతగా జిల్లాలో మంత్రి తుమ్మలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అభివృద్ధిలో పట్టు వదలని విక్రమార్కుడిలా పనిచేయడం ఆయన నైజం. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు, ప్రత్యేక వ్యవహార శైలి కలిగిన మంత్రి తుమ్మల అభివృద్ధికి తొలి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి ప్రధాతగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు ఆయన శ్రమిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్గ్రేడ్ చేసి ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా మార్చడంలో కీలక భూమిక పోషించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటేలా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుకు ముఖ్యమంత్రిని ఒప్పించి కృతకృత్యులయ్యారు.

### యువతకు ఉద్యోగం అవకాశాలు:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మహర్దశ పట్టనుంది. మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా మంజూరు చేయడంతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించునున్నాయి. వేలాదిమంది విద్యార్థుల ఉన్నత చదువులకు అవకాశాలు లభించడంతో పాటు శాస్త్రవేత్తలుగా తయారుచేసే అవకాశాలు ఉన్నాయి. ఎర్త్ సైన్సెస్ వర్సిటీతో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలజీ, జియో మేరపాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ శాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం వంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

### దేశ స్థాయిలో ఖ్యాతి:

భద్రాద్రి కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విద్యాలయానికి అన్ని వనరులు అవకాశాలతో పాటు దేశస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించనుంది. భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరును ఖరారు చేయడంతో ప్రపంచవ్యాప్తంగా భద్రాద్రి కొత్తగూడెం పేరు మారు మ్రోగనుంది. కొత్తగూడెంలో బొగ్గుతో పాటు అన్ని సహజ వనరులు ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో ఖనిజనిధిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పేరుంది. ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అన్ని అనుకూల వసతులు ఈ జిల్లాలో ఉన్నాయి. నేషనల్ హైవేకి సమీపంలో 300 ఎకరాల్లో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. ఈ విశ్వవిద్యాలయానికి సమీపంలో మినీ స్టీల్ ప్లాంట్, నవభారత్ లిమిటెడ్ , ఫెరో ఎల్లాయి, ఫెర్రో మెగ్నీషియం, విద్యుత్ ప్లాంట్ ఉన్నాయి. విద్యుత్ ప్లాంట్లు కూడా మరో 300 మెగావాట్ల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ

# నేటి నుంచి బడిబాట

- విద్యార్థుల నమోదు పెంపుదలే లక్ష్యంగా కార్యక్రమం
- ఇందుకోసం గత నెలలో ఇప్పటికే నాలుగుసార్లు పీటీఎం
- ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొనేలా ఆదేశాలు
- గత సర్కారు చేపట్టిన 'మన బడి'తో స్కూళ్లలో సౌకర్యాలు
- అదనపు తరగతి గదులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు,
- ప్రహరీలు, మరుగుదొడ్లు, మూత్రశాలల వంటి సదుపాయాలు

**ఖమ్మం-నవభూమిబ్యూరో**

రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శుక్రవారం నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహాలను గత నెల నుంచే రాష్ట్ర విద్యాశాఖ ప్రారంభించింది. దీనిలో భాగంగా గత నెల 9, 16, 26, 30 తేదీల్లో మొత్తం నాలుగు పీటీఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్స్) సమావేశాలు నిర్వహించారు. సర్కారు బడులకు వేసవి సెలవులు ఉన్నందున ఈ సమావేశాలను యథా ప్రకారం పాఠశాలల్లో కాకుండా జన సమ్మర్ధం ఉన్న ప్రదేశాలైన గ్రామాల్లోని కూడళ్లు, రచ్చబండ వంటి వివిధ ప్రదేశాల్లో ఈ సమావేశాలు జరిగాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు కలిసి ప్రభుత్వ స్కూళ్ల పనితీరు గురించి ఈ సమావేశాల్లో ప్రజలకు వివరించారు. దీంతోపాటు ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో సర్కారు బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, వివిధ ప్రయోజనాలను వివరించారు.

'మన ఊరు - మన బడి/ మన బస్తీ - మన బడి' కార్యక్రమం పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వందల కోట్లు వెచ్చించి సర్కారు బడులను అత్యున్నతంగా తీర్చిదిద్దిన విషయం విదితమే. ఈ సొమ్ముతో వేలాది పాఠశాలల్లో తగిన భౌతిక వనరులు, మౌలిక సదుపాయాలు సమకూరాయి. ఈ పథకంతో సర్కారు బడుల దశ తిరిగింది. గత సర్కారు ముందుచూపుతో చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ప్రయోజనం పొందారు.

అదనపు తరగతి గదులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, వంట గదులు, భోజన శాలలు, ప్రహరీగోడలు, మరుగుదొడ్లు, మూత్రశాలల వంటి అనేక సదుపాయాలు సమకూరాయి. దీంతో ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల ఆలోచన దృక్పథం క్రమేపీ మారింది. దశాబ్దాల తరబడి బోసిపోతున్న ప్రభుత్వ పాఠశాల భవనాలు ఈ పథకాలతో ఆకర్షణీయంగా ముస్తాబయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్వయంగా విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం పాఠశాలల పనితీరులో నిజంగానే మార్పులు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు విశ్వసించారు. దేశంలోనే తొలిసారిగా అన్ని ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో 75 అంగుళాల నిడివి గల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు సమకూరాయి. వీటి కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. దానిపై ఉపాధ్యాయులందరికీ శిక్షణ కూడా ఇచ్చారు. పాఠశాలల రూపురేఖలు మారడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పటిష్టమైన పునాదిపై నేడు పాఠశాలలు సగర్వంగా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పోటీ పడుతున్నాయి. అంతేగాక అనేక పాఠశాలలకంటే మిన్నగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పాఠశాలలకు తగిన వసతులు తామే కల్పించామని చెప్పుకుంటూ పూర్తిస్థాయిలో ప్రచారం చేసి పాఠశాలల్లో విద్యార్థులు నమోదు పెంచాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీని అమలు కోసం తగిన ప్రణాళికను సిద్ధం చేసింది.

**20 వరకూ బడిబాట..**

ఈ నెల 6 నుంచి ఈ నెల 20 వరకు బడిబాట కార్యక్రమం జరగనుంది. ఖమ్మం డీఈవో సామినేని సత్యనారాయణ ఈ కార్యక్రమ నిర్వహణపై ఎంఈవోలు, హెచ్ఎంలకు ముందుగానే మార్గదర్శనం చేశారు. బడిబాట కార్యక్రమానికి సమన్వయకర్తగా సీఎంవో యలగందుల రాజశేఖర్ వ్యవహరిస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



## ఒకే భూమి ఒకే ఆరోగ్యం యోగా మన భారతీయుల జీవన విధానం








**తిరుమలాయపాలెంజూన్ 05 -నవభూమి:** 11 వ అంతర్జాతీయ యోగా డే దశబ్ది ఉత్సవాలలో భాగంగా 9 వ రోజున శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల అంగన్వాడీ స్కూలు నందు ఆయుర్వేదిక్ వైద్యాశాల ఖమ్మం వారి ఆధ్వర్యంలో యోగా శిక్షకులు %చీ%. శ్రీకాంత్, %ు%. ప్రసన్న, అంగన్వాడీ %ంఎ్ట్రశీశీ్ర% టీచర్ విజయా, , ఆయా వినా 25 మంది పిల్లలకు యోగా నేర్పించి యోగా వల్ల ఉపయోగాలు గూర్చి తెలియజేసారు ఈ కార్యక్రమము లొ ఆశాలు నాగమణి, రమణ, విజయా, నిర్మల, శశిరేక, పాల్గొన్నారుల

## కార్పొరేటర్ మక్బూల్‌ను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ




**ఖమ్మం,జూన్ 05 -నవభూమి:** ఖమ్మం కార్పొరేషన్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బుల్ తల్లి రంజాన్ బీ ఇటీవల మరణించిన నేపథ్యంలో మాజీ మంత్రి, బి ఆర్ఎస్ నాయకులు పువ్వాడ అజయ్ కుమార్ గురువారం మక్బూల్ ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రంజాన్ బి కి నివాళులర్పి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు డివిజన్ నాయకులు ఉన్నారు.



### కుర్నవల్లి గ్రామంలో

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**తల్లాడ,జూన్ 05 -నవభూమి:** తల్లాడ మండలం కుర్నవల్లి రైతు వేదిక ఖమ్మం జిల్లా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం వైరా మరియు వ్యవసాయ శాఖ ఖమ్మం జిల్లా వారి సహకారంతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె రవికుమార్ మాట్లాడుతూ తక్కువ యూరియా వాడండి సాగు ఖర్చులు తగ్గించండి అవసరం మేరకు రసాయనాలను వినియోగించండి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడండి అనే అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ వి చైతన్య ఉద్యాన శాస్త్రవేత్త సాగునీటిని ఆదా చేయండి భావితరాలకు అందించండి మరియు చెట్లను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి అనే అంశాలపై వివరించారు. శ్రీమతి పి ఎస్ ఎం ఫణి శ్రీ వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త పంట మార్పిని పాటించడం సుస్థిర ఆదాయాన్ని పొందండి మరియు రసీదులను భద్రపరచండి, ప్రకృతి వైపరీత్యాలు సీడ్స్ సరిగా లేకపోయినా పంట నష్ట పోతే రసీదులు ఉంటే కష్ట కాలాల్లో నష్టపరియాన్ని పొందడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పసుమర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం రాజేష్ పశుపోషన్లో పాటించవలసిన మెలకువలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి శ్రీ నగేష్ మాట్లాడుతూ రైతులకు పామాయిల్ సాగుపై, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకం, సబ్సిడీ గురించి క్లుప్తంగా వివరించారు. రైతులు కూరగాయల పంటల సాగుపై మొగ్గు చూపాలని ఉద్యాన శాఖ అందిస్తున్న ప్రోత్సాహకల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల వ్యవసాయ అధికారి శ్రీ తాజుద్దీన్. మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలని. సేంద్రియ కార్బనం పెరిగే విధంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని. విత్తనాలు కొనేటప్పుడు పాటించవలసిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీమతి త్రివేణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని వారి సందేహాలను శాస్త్రవేత్తలతో నివృత్తి చేసుకున్నారు.

# ప్లాస్టిక్ వినియోగంపై సంపూర్ణ నిషేధం

- ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సింగరేణి సిఎండి బలరామ్ ప్రకటన
- ప్రతి ఒక్కరూ కనీసం 3 మొక్కలు నాటాలని పిలుపు



**కొత్తగూడెం జూన్ 5-నవభూమి:** ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం అనే నినాదం తీసుకున్నారని, దీనిని అనుసరిస్తూ సింగరేణి హైదరాబాద్ కార్యాలయం తో పాటు సింగరేణి లోని అన్ని ఏరియాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నిషేధిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్ సంచలన ప్రకటన చేశారు.ముఖ్యంగా ప్లాస్టింగ్ బాటిల్స్ను మొత్తానికే వినియోగించొద్దని స్పష్టం చేశారు.హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి తన సందేశమిచ్చారు. సింగరేణి సంస్థలో ఇప్పటికే పలు రకాల పర్యావరణహిత చర్యలు చేపడుతున్నామని, కొన్నిచోట్ల ప్లాస్టిక్ ను వాడటం మానేశారని, అయినప్పటికీ ఈ ఏడాది ఇచ్చిన ప్రపంచ పర్యావరణ నినాదాన్ని అనుసరించి సింగరేణి కార్యాలయాలు, గనులు, డిపార్ట్ మెంటులలో ప్లాస్టిక్ తో తయారుచేసిన బాటిల్స్, ప్లేట్లు, వస్తువులు తదితరాలపై ఇక సంపూర్ణ నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. సంస్థలోని అధికారులను, కార్మికులు, ఉద్యోగులు దీనికి సహకరించాలని కోరారు. తమ ఇంటి వద్ద కూడా ప్లాస్టిక్ వాడకాలను తగ్గించాలని సూచించారు. పర్యావరణం పట్ల అభిమానంతో తాను ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా 19 వేల మొక్కల్ని నాటానని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని సంస్థ డైరెక్టర్లు, ఇతర కార్మికులు కూడా మొక్కలు నాటడం ప్రారంభించారని ఇది ఎంతో సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం 3 మొక్కలు నాటాలని, అటువంటి ఆసక్తి గల వారికి సింగరేణి సంస్థ ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుందని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం సింగరేణి ప్రాంతాల్లో ఎండాకాలం 50 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండేవని, సింగరేణి సంస్థ విస్తారంగా మొక్కలు నాటిన కారణంగా, ఆ మొక్కలు అడవులుగా పెరిగి వాతావరణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పడిపోయాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ కు ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు గని ఉన్న అంగుల్ ప్రాంతంలో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్టు స్థానికులు తెలియజేశారని చెప్పారు కనుక అక్కడ కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి సింగరేణి సంస్థ సంసిద్ధమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్ ) ఎస్ డీ ఎం. సుభాని, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్ ) ఎన్.వి. రాజశేఖర్ రావు,ఇంకా వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పర్యావరణంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి ఛైర్మన్ బహుమతుల్ని అందజేశారు. ఉద్యోగులకు జ్యూట్ బ్యాగుల్ని పంపిణీ చేశారు.

# యువకులకు వాలీబాల్ కిట్ అందించిన కంచర్ల హరీష్

**జూలూరుపాడు, జూన్ 05 -నవభూమి:** మండల కేంద్రంలో గల న్యూ కాలనీ యువకులకు యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంచర్ల హరీష్ గురువారం వాలీబాల్ కిట్ అందించారు.యువకులు ఆయనకు కృతజ్ఞతా పూర్వకంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడలతో పాటు సామాజిక సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.క్రీడల వలన భౌతిక,మానసిక ఆరోగ్యం చేకూరుతుందని, స్నేహ భావం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి మాడుగుల నాగరాజు,గ్రామ కమిటీ కార్యదర్శి,ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సమీర్,పవన్,తదితర యువకులు పాల్గొన్నారు.



## బీఎస్పీ రాష్ట్ర నేత గురుమూర్తి తండ్రి మృతి



**తిరుమలాయపాలెంజూన్ 05 - నవభూమి:** తిరుమలాయపాలెం: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్మిక శాఖ అధ్యక్షుడు మట్టే గురుమూర్తి తండ్రి మట్టే ఇదయ్య గారు గురువారం కన్నుమూశారు. ఆయన స్వగ్రామమైన తిరుమలాయపాలెం మండలం జూపేడలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలేరు అసెంబ్లీ అధ్యక్షుడు ఎన్.బోయిన రమేష్, నల్లగట్టు శంకర్, పోలేపంగు మాల్సూర్, కొమ్ము పూలే, మట్టే నాగేశ్వరరావు తదితర బహుజన నాయకులు పాల్గొని మృతునికి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

### 2 టౌన్ సిఐకు మొక్కను అందజేసన ప్రపంచ పర్యావరణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల భూపేష్



**కొత్తగూడెం జూన్ 05 -నవభూమి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం 2 టౌన్ ఇన్స్పెక్టర్ డి.ప్రతాప్ కి ప్రపంచ పర్యావరణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల భూపేష్ మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా భూపేష్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972 జూన్ 5వ తేదీన ఆమోదించి ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తుందని. అదేవిధంగా భారతదేశంలో పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 లో తీసుకురావడం జరిగిందన్నారు. 2025 సంవత్సరాన్ని ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం అనే ఇతివృత్తం గా ఎంచుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె ఖయ్యూం, జిల్లా కమిటీ సభ్యులు మర్రి గోపికృష్ణ, ఎస్.కె రసూల్, సామర్ల సమ్మయ్య, బానోతు శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి

**కొత్తగూడెం జూన్ 05 -నవభూమి:** ఛత్తీస్ గడ్ లో మరో మావోయిస్టు అగ్ర నేతను ఆ పార్టీ కోల్పోయింది. ఎన్కౌంటర్‌లో మావోల అగ్ర కమాండర్ నేత సింహాచలం అలియాస్ సుధాకర్ మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టుల క్యాడర్ ఉన్నట్లు సమాచారంతో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి ఛత్తీస్ ఘడ్ పోలీస్ బలగాలు, సైనికులు. మావోయిస్టులు, ఉమ్మడి దళాల మధ్య గురువారం ఉదయం నుంచి ఎదురుకాల్పులు జరిగాయి. ఈ మేరకు జరిగిన ఎన్కౌంటర్‌లో మావోల అగ్ర కమాండర్ నేత సింహాచలం అలియాస్ సుధాకర్ మృతి చెందారు. మావోయిస్టు అగ్ర నేత సుధాకర్ తలపై రూ.50 లక్షల రివార్డు ఉంది. సుధాకర్ స్వస్థలం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం.



## ప్రకృతి వైపరీత్యాలు నివారణపై

# అవగాహన సదస్సు





**తిరుమలాయపాలెం జూన్ 05 -నవభూమి:** రానున్న కాలంలో పకృతి వైపరీత్యాల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని మండల తాసిల్దార్ లూథర్ వి ల్సన్ ఎంపీడీవో సి లార్ సాహెబ్ అన్నారు గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని రైతువేదిక నందు "ప్రకృతి వైపరీత్యాలు - నివారణ చర్యలు, సీజనల్ వ్యాధులు తీసుకొనవలసిన జాగ్రత్తలు పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. గతంలో వరదల వల్ల ప్రభావితం అయిన ప్రదేశాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, కూలిపోయే స్థితిలో ఉన్న ఇండ్లను గుర్తించి వివరములు నమోదు చేయాలి గ్రామస్థాయిలో ఉండే సిబ్బంది అందరూ వారి కార్యస్థానంలో అందుబాటులో ఉండాలి.గ్రామస్థాయిలో ఉండే అధికారులు, మండల స్థాయి అధికారులు, ఆపదమిత్ర సభ్యులు, ఎన్.జి.ఓ. సభ్యులు, మత్స్యకారులు మరియు గజ ఈతగాళ్లు తదితరులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలి.వాతావరణ పరిస్థితులపై జిల్లా నుంచి వచ్చే తాజా సమాచారం ఎప్పటికప్పుడు గ్రామస్థాయి / మండల స్థాయి వాట్సాప్ గ్రూప్ నందు పోస్ట్ చేయవలెను ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు చెరువులు మరియు పంటకాలువల నీటి ప్రవాహం తదితరములు పర్యవేక్షిస్తూ గ్రామస్థాయి మరియు జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వాలి పునరావాస కేంద్రాలను ముందస్తుగా గుర్తించి అక్కడ త్రాగునీరు మరియు మరుగుదొడ్లు పరిశీలన చేసి ఏర్పాట్లు చేయాలి నీరు నిల్వ ఉన్న వాడకంలో లేని బావులు మరియు గుంతల్లో మత్స్య శాఖ వారిచే గంబుషియా చేపలను తెప్పించి వదలవలెను విద్యుత్ శాఖ అధికారులు మరియు సిబ్బంది అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉండాలి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మందులు నిల్వ ఉంచుకోవాలి పోలీస్ శాఖ అధికారులు గ్రామస్థాయిలో పోలీస్ సిబ్బందిని అందుబాటులో ఉంచి గ్రామస్థాయి అధికారులతో సమన్వయంతో పనిచేయాలి ఏదైనా అత్యవసర ప్రకృతి వైపరీత్యం సంభవించినచో యన్.డి.ఆర్.యఫ్. / యస్.డి.ఆర్.యఫ్. సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చేవరకు వేచి చూడకుండా మండల స్థాయిలో (20) నిపుణులను అందుబాటులో ఉంచాలి పశు వైద్య సిబ్బంది వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి ప్రతి గ్రామంలో మైక్ సెట్ అందుబాటులో ఉంచుకోవాలి క్షేత్రస్థాయిలో పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బంది కలిసి సమన్వయంతో పనిచేయాలి ముందుగా వర్షపు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించాలి పారిశుధ్య మెటీరియల్ సిద్ధంగా ఉండాలి ఇప్పటి నుండే గ్రామపంచాయతీల పరిధిలోని అంతర్గత రహదారులు, డ్రైన్స్ శుభ్రపరచవలెను వాడకంలో లేని బావులను గుర్తించి వాటిని గ్రావెల్ తో నింపాలి ఆయిల్ బాల్స్ సిద్ధంగా ఉంచాలి గంబుషియా చేపల కొరకు వెరా మత్స్య శాఖ వారికి ఇండెంట్ ఇవ్వాలి ప్రభుత్వ పాఠశాలలు మరియు రెసిడెన్షియల్ స్కూల్స్ నందు పరిసరాలు మరియు పైకప్పులను వర్షపు నీరు సజావుగా వెళ్లేలా శుభ్రపరచవలెను, అట్టి చెత్తను గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా కంపోస్టు షెడ్ నకు తరలించాలి ప్రతి మంగళవారం మరియు శుక్రవారం డ్రైడే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి గత సంవత్సరం డెంగ్యూ కేసులు నమోదు అయిన ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలి మంచినీటి ట్యాంకులు, చేతిపంపుల వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి క్లోరినేషన్ చేసి శుద్ధమైన త్రాగునీరు సరఫరా చేయాలి టైర్ షాపులు యజమానులకు ముందస్తుగా టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చుడాలని నోటీసులు జారీ చేయాలి. అతిక్రమించిన వారిపై జరిమానా విధించాలి కొబ్బరి బోండా షాపులు, నాన్ వెజ్ షాపుల నిర్వాహకులతో మాట్లాడి వ్యర్థాలను డంపింగ్ యార్డు వద్దకు వారే స్వయంగా తరలించేలా నోటీసులు జారీ చేయాలి ఎటువంటి సీజనల్ మరియు అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి మంచినీటి సరఫరా పైప్ లైన్ లీకేజీలు ఎప్పటికప్పుడు నివారించాలి వరదలు మరియు విపత్తులకు సంప్రదించవలసిన ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ : 1077 ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య, యం.పి.డి.ఓ. యస్.కె.శిలార్ సాహెబ్, తహశీల్దార్ జి.లూథర్ విల్సన్, యం.పి.ఓ. పి.సూర్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి సీతారామరెడ్డి, వైద్యాధికారిణులు వసుంధర, హారిక, ఆర్.డబ్ల్యు.యస్. ఇంజనీర్ ఖలీల్, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసిన కే రామనారాయణ

**ఖమ్మం, జూన్ 05 -నవభూమి:** ఆంధ్ర ప్రదేశ్ ప్రెశకాడమీ చైర్మన్గా ఇటీవల నియమితులైన ఆలపాటి సురేష్ కుమార్ పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విజయవాడలో టి యు డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రామనారాయణ గురువారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, మైనార్టీ ఎఫైర్స్ అడ్వైజర్ షరీఫ్ మహమ్మద్ అహ్మద్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ, ఖమ్మం జిల్లా యూనియన్ నాయకులు నంచర్ల జనార్ధనాచారి, చెరుకుపల్లి శ్రీనివాసరావు, ఏలూరి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు ఎన్ఆర్ఐలు వివిధ సంఘాల నాయకులు డాక్టర్లు లాయర్లు ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఆయన ఘనంగా సన్మానించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున తనకు జరిగిన సన్మానానికి ఎంతో ఆనందంగా ఉందని నా మీద పెట్టిన బాధ్యతను న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి



**కొత్తగూడెం జూన్ 05 -నవభూమి:** ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం మున్సిపాలిటీ 23వ వార్డు కూలీ లైన్లో పచ్చదనం పరిశుభ్రత స్వచ్ఛ పర్య వేక్షన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ సుజాత, మాజీ కౌన్సిలర్ సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. కమీషనర్ సుజాత మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ప్రతి ఒక్కరూ ఉంచుకోవాలని, పచ్చదనాన్ని, స్వచ్ఛధనాన్ని, ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, అన్ని బస్తీలలో తడి చెత్త పొడి చెత్తను ప్రతి ఒక్కరు వేరుచేసి ఇవ్వాలని చెప్పారు. సెరిగ్రేషన్ లో భాగంగా తడి చెత్త పొడి చెత్త వేరుచేసి ఇవ్వటంలో 23వ వార్డు కూలీ లైన్ లో డ్వాక్రా గ్రూపులు, మహిళల పాత్రను 23వ వార్డు ప్రజలను పారిశుధ్య కార్మికులను వారు అభినందించారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగూడెం కార్పొరేషన్ గా మారబోతున్న శుభ సందర్భంలో కూలి లైన్ లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవ నిర్వహించడం సంతోషకరంగా ఉందని,అన్ని ఏరియాలలో కోతులు కుక్కలను పట్టి వాటిని దూరంగా విడిచి పెట్టాలని, రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పిచ్చి చెట్లు చెత్తాచెదారం కాల్వల్లో మురుగు లేకుండా గ్యాంగ్ వర్క్ చేపించాలని, బ్లీచింగ్ దోమల మందు నిరంతరం చల్లిస్తూ అన్ని వార్డులను బస్తీలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు విష జ్వరాలు రాకుండా మందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మద్యానికి బానిసై పురుగు మందు సేవించి వ్యక్తి మృతి

**జూలూరుపాడు, జూన్ 05 -నవభూమి:** గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు సేవించి వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది.స్థానిక పోలీస్ హెడ్ కానిస్టేబుల్ దయానంద్ కథనం ప్రకారం మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన కల్తీ వెంకటేశ్వర్లు(40) అనే వ్యక్తి గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు.ఇంట్లో కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతూ,మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వకపోతే చనిపోతా అంటూ బెదిరిస్తుండేవాడని,ఇదే క్రమంలో గత నెల 31వ తారీకున తన భార్యతో మద్యం డబ్బుల గురించి గొడవపడి,ఇంట్లో నుండి బయటికి వెళ్ళి పురుగుల మందు త్రాగాడు.ఇంటికి వచ్చి అదే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు.కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స కొరకు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినారు.వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ లోని ఎం జీ ఎం గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. మృతుడి భార్య కల్తీ మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సింగరేణి మెడికల్ అన్ ఫిట్, ఉద్యోగాల పేరుతో వసూళ్లు

### మరొకరిని అరెస్ట్ చేసిన ఏసీబీ

**కొత్తగూడెం జూన్ 05 -నవభూమి:** సింగరేణి మెడికల్ అన్ ఫిట్, ఉద్యోగాలు ఇప్పించే పేరుతో డబ్బులు దండుకున్నారన్న ఆరోపణపై తాజాగా గురువారం ఒక యువతిని ఏసీబీ అరెస్ట్ చేసింది. సింగరేణి లో అవినీతి పై ఏసీబీ దృష్టి సారించింది. విజిలెన్స్ విచారణ అనంతరం ఉద్యోగాలు ఇప్పించే పేరుతో, మెడికల్ అన్ ఫిట్ చేయిస్తామని పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్టు గుర్తించి ఏసీబీ కి ఫిర్యాదు చేశారు. దీనితో ఇటీవల సింగరేణి ఉద్యోగి అన్నబోయిన రాజేశ్వరరావు ను ఇటీవల ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్ అరెస్ట్ చేశారు. ఆ కేసుకు సంబంధం ఉందన్న కారణం తో గురువారం చుంచుపల్లి మండలం గౌతమ్ పూర్ కు చెందిన కడలి చైతన్య అనే యువతిని ఏసీబీ డి ఎస్పీ అరెస్ట్ చేశారు. గురువారం ఉదయమే నిందితురాలి ఇంటివద్దకు చేరుకున్న ఏసీబీ బృందం ఆమె ను ప్రశ్నించింది. అనంతరం అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ ఇప్పట్లో ఒక కొలిక్కి వచ్చే సూచనలు కనిపించడం లేదు.

# జూలూరుపాడు మార్కెట్ సాధన కమిటీ ఏర్పాటు



**జూలూరుపాడు, జూన్ 05 -నవభూమి:** గత రెండు దశాబ్దాలుగా మండల కేంద్రంలో పత్తి కొనుగోలు రికార్డ్ స్థాయిలో ఉంది. రాష్ట్ర స్థాయిలో అదిలాబాద్ తర్వాత అత్యధిక ఆదాయం ఉమ్మడి ఖమ్మం జిల్లా లోని ఏనుకూరు మార్కెట్ పరిధిలో గల జూలూరుపాడు ఉప మార్కెట్ నుంచి కోట్లాది రూపాయలు సెస్సు రూపంలో ప్రభుత్వానికి అందుతుంది. 2016 లో జిల్లాల విభజన తర్వాత జులురుపాడు భద్రాద్రి కొత్తగూడెంలోకి వచ్చింది. ఆదాయం ఖమ్మం జిల్లాకు వెళుతోందని అఖిల పక్ష రాజకీయ పార్టీల పోరాటంతో డిమాండ్ ఊపు అందుకొంది.ప్రభుత్వం సమ్మతించినట్టు,దీనితో జూలూరుపాడు ను ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ గా ఏర్పాటు చేయాలని ఆనాటి వైరా మాజీ శాసన సభ్యులు రాములు నాయక్ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం పరిశీలించి 2022 లో మార్కెట్ ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ప్రకటనే తరువాయి అని వార్తలు వచ్చాయి.ఈ లోపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. వైరా ఎమ్మెల్యే గా రాందాస్ నాయక్ ఎన్నికయ్యారు.ఎమ్మెల్యే తో పాటు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి మార్కెట్ ఏర్పాటుకు విషయం తీసుకెళ్లారు.ఆచరణలో మాత్రం కార్య రూపం దాల్చలేదు.గురువారం మండల కేంద్రం లో రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అఖిల పక్షంగా ఏర్పడి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మార్కెట్ సాధన కమిటి కన్వీనర్ గా బానోతు ధర్మా తోపాటు 29 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గుండెపున్ని వెంకటేశ్వర్లు,లకావత్ గిరిబాబు,మూడు చిట్టిబాబు,రోకటి బాబు, బొల్లం లక్ష్మయ్య,లకావత్ నాగేశ్వరావు, షేక్ నాగుల్ మీరా,బానోతు రాంబాబు తోటకూరి నరేష్ పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలోనే 10 ఎకరాల భూమి కేటాయించిందని మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో దానికి హద్దులు సైతం ఏర్పాటు చేసిందని తెలిపారు.నిధులు మంజూరు చేసి అనేక మంది హమాలీలు,గుమస్తాలకు ఉపాధి కల్పించేందుకు శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తాళ్లూరి లక్ష్మయ్య,ఎల్లంకి మధు,లింగాల వీరభద్రం, తోటకూర నరేష్,చాంద్ పాషా,చలమల నరసింహారావు, గత్తం బాబురావు,పోతురాజు బోడయ్య,పప్పుల జాన్,పండు,ఇల్లంగి సుందరం, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో ఏబిసిడి

# డ్రైవ్‌లు నిర్వహించాలి



**కొత్తగూడెం జూన్ 05 -నవభూమి:** జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఏబిసిడి డ్రైవ్ లు నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఏబిసిడి డ్రైవ్,భూభారతి రెవెన్యూ సదస్సులు,బక్రీద్ పండుగ ఏర్పాట్లు, ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుక సరఫరా, బడిబాట గ్రామసభల నిర్వహణ వనమహోత్సవ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో ఏబిసిడి డ్రైవ్ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఏ - అజొల్లా పెంపకం: పశువులకు పోషకాహారం అందించేందుకు అజోల్లా సాగు ప్రోత్సహించాలని దీనికి గాను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ ఇంటి వద్దనే నిరుపయోగంగా ఉన్న డ్రమ్ములు,ట్యాంకులలో అజోల్ల సాగు చేపట్టే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. బి - బయోచార్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బయోచార్ తయారు చేసి వ్యవసాయంలో ఉపయోగించడం ద్వారా మట్టిలో జీవన సారాన్ని పెంచి, అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని అన్నారు.సి - కంపోస్టింగ్: మట్టి ద్వారా ఇటుకలు తయారీ పై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఇప్పటికే ఐదు యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా ఐదు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వీటి ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు మట్టితో ఇటుకలు తయారుచేసి ప్రహరీ గోడలు నిర్మించే విధంగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.డి - డిగ్గింగ్ సోక్ పిట్: అన్ని ప్రధాన రహదారులు కార్యాలయాలలో రానున్న వర్షాకాలంలో ఎక్కడ నీరు నిల్వకుండా ప్రతి చోటా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ - పామ్ పౌండ్స్: జిల్లా వ్యాప్తంగా ప్రతి వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పౌండ్స్ నిర్మించాలని,రైతులు ఆర్థిక అభివృద్ధి చెందడానికి మొదటి అడుగుగా ఈ ఫామ్ పౌండ్స్ ఉపయోగపడతాయన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులు: వివిధ రకాల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులకు వచ్చే రైతుల తో అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎక్కువగా ఏ సర్వే నెంబర్లు సమస్యలు వస్తున్నాయో, ఎంతమంది వస్తున్నారు, దానికి గల కారణాలను నమోదు చేయాలన్నారు.ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుక సరఫరా: గ్రౌండింగ్ పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎన్ని ట్రక్కుల ఇసుక అవసరం అవుతుందో ఎంపీడీవోలు తాసిల్దారులకు నివేదికల అందజేయాలన్నారు. తాసిల్దార్లు, ఏడి మైన్స్ అధికారులు సమన్వయంతో అమ్మ ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక రవాణాను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. ఇసుక రవాణా కు సంబంధించి రిజిస్టర్ లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.బడిబాట:నేటి నుండి ప్రారంభమయ్యే బడిబాట కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రతి గ్రామంలో బడిబాట గ్రామసభలు నిర్వహించి విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని, మధ్యలో బడి మానివేసిన పిల్లల వివరాలు నమోదు చేసి వారి తల్లిదండ్రులతో మాట్లాడి అర్హత కలిగిన తరగతుల్లో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**బక్రీద్ పండగ ఏర్పాట్లు:** బక్రీద్ పండగ నేపథ్యంలో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించి నమాజ్ వేళల్లో విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మసీదుల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని,చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా వేస్టేజ్ కవర్లను పంపిణీ చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందు లు రావద్దని,సమయానికి నీరు వచ్చేలా చూడాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.వన మహోత్సవం:జూలై 1 నుండి ప్రారంభమయ్యే వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడానికి అనువైన ప్రదర్శనలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వనమహోత్సవంలో ప్రజలకు ఉపయోగపడే మొక్కలు మాత్రమే నాటాలని ఆదేశించారు. రాబోయే సంవత్సర కాలంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వెదురు సాగు చేసే విధంగా పోడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మన జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి గ్రామంలో వెదురు సాగు ద్వారా అధిక లాభాలు గడిస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకొని జిల్లా వ్యాప్తంగా అధికంగా వెదురు సాగు చేపట్టి ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం పొందాలని కలెక్టర్ కోరారు. అటవీ భూమిని ఉపయోగించుకొని ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చు పోడు రైతులకు తెలియజేశాల్సిన బాధ్యత అధికారుల మీద ఉందని కలెక్టర్ తెలిపారు.

## కొత్తగూడెంకు ఎర్త్ సైన్సెస్ వర్సిటీ

**(1వ పేజీ తరువాయి)**ప్రాంతానికి సమీపంలో ఐటీసీ పేపర్ బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్ ఉన్నాయి. ఈ ప్రాంతానికి 20 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఈ కల నెరవేరనుంది. రోడ్డు మరియు రైలు రవాణా మార్గాలు ఈ ప్రాంతానికి అతి సమీపంలో ఉన్నాయి. 35 కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ప్రవహిస్తుంది. దీనివల్ల భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఉండవు.